క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రఘునందన్‌ను గురువారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ (ఏడీఎంఈ) డాక్టర్ ఆలపాటి ఏడుకొండల రావు మర్యాద పూర్వకంగా కలిశారు. పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఎంఈ కార్యాలయానికి వెళ్లి డాక్టర్ రఘునందన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో వైద్య విద్యను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన తల్లి కనిపించడం లేదంటూ కుమారుడు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట బ్రహ్మం గారి మఠం ప్రాంతానికి చెందిన పద్మనాభుని బాల వెంకటేశ్వర్లు, లక్ష్మీ పద్మకుమారి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. బాలవెంకటేశ్వర్లు కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. 2వ తేదీ వెంకటేశ్వర్లు భార్యకు మధ్య చిన్న పాటి గొడవ జరిగింది. దీంతో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బట్టలు తీసుకుని బయటకు వెళ్లిపోయింది. బయట నుంచి వచ్చిన కుమారుడు సంపత్‌కుమార్‌కు ఇంట్లో తల్లి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బస్టాండ్, రైల్వే స్టేషన్, ఇతర బంధువుల ఇంట విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో తన తల్లి కనిపించడం లేదంటూ సంపత్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కపర్తి లక్ష్మణరావు సేవలు అపూర్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీపీఐ సీనియర్ నేత స్వర్గీయ కపర్తి లక్ష్మణరావు సేవలు అపూర్వమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. కపర్తి లక్ష్మణరావు నాలుగో వర్ధంతి కార్యక్రమం చేపలమార్కెట్ సమీపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కపర్తి లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, తాడి పైడయ్య, ఎం సాంబశివరావు, పేరయ్య, రాయన గురునాథం తదితరులు పాల్గొన్నారు.

శయన గణపతిగా బాల గణపతి దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి గురువారం శ్రీ శయన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలో కొలువై ఉన్న శ్రీ బాల గణపతి స్వామి వారి ఆలయంలో స్వామి వారి చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకారం చేసి సహస్ర నామార్చనను శాస్త్రోక్తంగా జరిపారు. అలాగే మధ్యాహ్నం సహస్ర మోదక (ఉండ్రాళ్ల) పూజను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

వైభవలంగా ఊంజల సేవ..

ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి గురువారం ఊంజల సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు మహిళా బృందాలు ఉత్సాహంగా సంకీర్తనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. పటమటలోని వల్లూరు సరోజినిదేవి స్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. పటమట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి. కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో–ఆర్డినేటర్ జాకబ్‌రాజు, ఓ నజ్మా, కె. ప్రియాంక, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ ఒ. జ్యోతి చంద్రిక, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణను ఆపాల్సిందే

- వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్
- ధర్నా అనంతరం వక్ఫ్‌బోర్డు సీఈవోకు వినతి



ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణను ఆపాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ డిమాండ్ చేశారు. ముసాఫిర్ ఖానా వద్ద గురువారం వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లోని పేద ముస్లిం ప్రజలు ముసాఫిర్‌ఖానాలో వివాహాలు జరుపుకుంటారని చెప్పారు. కొంతమంది అసాంఘిక శక్తులు, కబ్జాదారులు దీనిపై కన్నేశారన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించాలన్నారు. గతంలో టీడీపీ పాలనలో ముసాఫిర్‌ఖానా అభివృద్ధిని మధ్యలోనే ఆపేశారని, దానిని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేస్తే ముస్లిం ప్రజలందరితో కలిసి పోరాటాలు చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నాయకులు వక్ఫ్‌బోర్డు సీఈవోను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అతీక్, మైనార్టీ సెల్ పశ్చిమ కన్వీనర్ ఎండీ అన్వర్, నాయకులు గోరు సలీం, యోనుస్, సుభానీఖాన్, షేక్ నస్రుద్దీన్, సల్మా సుల్తానా, నజీర్, మోసిన్, కరీం, హుస్సేన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పరం చేయొద్దు

షాజహూర్ ముసాఫిర్ ఖానాను లీజు పేరిట ప్రైవేట్ పరం చేయొద్దని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ నేత షేక్ హసన్ బాష (బాషి) అన్నారు. గురువారం వించిపేటలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముసాఫిర్ ఖానాను ప్రైవేటుపరం చేసే ఆలోచనను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించాలన్నారు. వక్ఫ్ బోర్డ్ వారు గతంలో పేద ముస్లింల కుటుంబాలు వివాహాలకు తక్కువ రేటుతోనే ముసాఫిర్ ఖానాను ఇచ్చేవారని, రంజాన్‌కు పేదలకు జకాత్ ఇచ్చేవారని చెప్పారు. నాయకులు అన్సారి బేగ్, జిలాని షేక్, ఖలీల్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలోని ప్రధానమైన ముసాఫిర్‌ఖానా దాత ఆశయాన్ని తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలోని ముసాఫిర్‌ఖానాను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు తద్వారా దానిని ముస్లిం సమాజానికి దూరం చేసేందుకు వక్ఫ్ బోర్డు ద్వారా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు.

ఇది ఆశయం..

ప్రధానంగా షాజహూర్ అనే ముస్లిం ప్రముఖుడు నగరానికి వచ్చే యాత్రీకుల విడిది కోసం దానిని ఏర్పాటు చేశారని, దానిపై వచ్చే ఆదాయంతో అనాథలకు, వితంతువులకు సాయమందించాలని సూచించారని ఆసిఫ్ పేర్కొన్నారు. అయితే అది పురాతనమవ్వటంతో దాని స్థానంలో కొత్త భవనం నిర్మించారన్నారు. గతంలోని చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్టర్లుకు నిధులు నిలిపివేశారని, దీని పేరు సైతం మార్పు చేసేందుకు కుట్ర చేస్తే తాము పోరాడమని గుర్తు చేశారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయటంతో పాటుగా ప్రారంభించామని పేర్కొన్నారు. కానీ గడిచిన 14 మాసాలుగా కూటమి ప్రభుత్వం దానికి పాలకవర్గాన్ని నియమించకుండా తాత్సారం చేసి ఇప్పుడు ఏకంగా కబ్జా చేసేందుకు నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రజాప్రతినిధులు దీనిపై ప్రకటన చేయాలని, అలాగే కూటమిలోని ముస్లిం నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు.

బెరంపార్క్‌లో గణనాథునికి ఘనంగా వీడ్కోలు



స్వామివారి లడ్డు ప్రసాదాన్ని పాడుకున్న శ్రీనివాస్, చిత్రంలో డీవీఎం కృష్ణచైతన్య



బెరంపార్క్ సిబ్బందితో డీవీఎం కృష్ణచైతన్య, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం జరిగింది. బెరంపార్క్ ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా ఒకరిపై ఒకరు గులాం చల్లుకుంటూ డాన్స్‌లు చేస్తూ గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ తీసుకువెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజులు పూజలందుకున్న గణపతి విగ్రహం వద్ద పెట్టిన హుండీని వేలం వేయగా ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య రూ.8వేలకు పాడుకున్నారు. అలాగే స్వామివారి మెడలో వేసిన పది వేల రూపాయల విలువ చేసే రూ.100 నోట్ల దండను కూడా ఆయనే రూ.65 వేలకు పాడుకున్నారు. అనంతరం స్వామివారి ముందు పెట్టిన 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కారసాల శ్రీనివాస్ రూ.61 వేలకు పాడుకోగా, చిన్న లడ్డూ (కిలో)ను మహేష్ రూ.9,500 కు పాడుకున్నారు. వినాయక ఉత్సవాల్లో స్వామివారికి గురుజాడ బాల చంద్రశేఖర్ శర్మ, కృష్ణలు పూజాధికాలు నిర్వహించగా వారిని సత్కరించారు. ఈ సందర్భంగా బెరంపార్క్ మేనేజర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుంచి ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, అందుకు సహకరించిన ఉద్యోగులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాలు చేరుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఎన్‌పవరింగ్ యూత్ అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గోల్స్ సెట్ చేసుకుని రోడ్ మ్యాప్‌తో రెడీగా ఉండాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రైనర్ ఫాజియా సెల్ఫ్ అవేర్‌నెస్, కాన్ఫిడెన్సు పెంపొందించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను వివరించారు. విద్యార్థులు డిజిటల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని వినతి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటో, క్యాబ్, టాటాఏస్ డ్రైవర్ కార్మిక కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్‌ను ఆదుకోవాలని కోరుతూ అన్ని యూనియన్ల ఆధ్వర్యంలో ఈనెల 8న మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేస్తామని, ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని ఏపీ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, ఏపీ ప్రగతిశీల ఆటో, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె. పొలారి అన్నారు. దుర్గాపురం బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 25 వేలు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీఓ నెం. 21 వంటి ఎన్నికల హామీలను అమలు చేయాలని, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్న ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్. శివాజీ, కె. దుర్గారావు, మునిశంకర్, ఈశ్వరరావు, బాష తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటి నిల్వ సమస్య పరిష్కారానికి చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వర్షం నీటి నిల్వలకు శాశ్వత పరిష్కారం చూపేలా వర్షం నీటిని సమీప కాలువల్లోకి మళ్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, బెంజ్ సర్కిల్ నుంచి రామవరప్పాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు, మాచవరం ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షం కురిసినప్పుడల్లా పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, జమ్మి చెట్టు సెంటర్, పరిసర ప్రాంతాల్లో వర్షం నీటి నిల్వలు నిలవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి గల కారణాలు, వాటిని అధిగమిస్తూ శాశ్వత పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బెంజ్ సర్కిల్ హైవే సర్వీస్ రోడ్డు వద్ద ఉన్న డ్రెయిన్ వెడల్పు మరింత పెంచాలని సూచించారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు నుంచి పుల్లేటి కాలువ వరకు రెండున్నర కిలో మీటర్లు ఒక డ్రెయిన్ ప్రవహించే అవసరం ఎందుకు వస్తోందని, సమీపంలో ఉన్న బందరు కాలువలోకి నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకునేలా ప్రణాళికను సిద్ధం చేసి కార్యాచరణను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మరో వైపు పుల్లేటి కాలువ విస్తరణకు చర్యలు తీసుకోవడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఏలూరు రోడ్డులో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో ప్రవహించేందుకు శాశ్వత పరిష్కారంలో భాగంగా మాచవరం శ్మశానం వద్ద ఉన్న డ్రెయిన్‌ను పరిశీలించారు. ఆ డ్రెయిన్‌ను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకట నారాయణ, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతో సాంస్కృతిక వైభవం

'సంస్కార భారతి' రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ, వేదికమీద జగన్‌మోహనరావు, బాలాజీ నాయుడు

విజయవాడ కల్చరల్: దేశ సాంస్కృతిక వైభవంలో యువతను భాగస్వాములను చేయాలని సంస్కార భారతి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. రామకృష్ణా నాట్యమండలి రెండు రోజుల పాటు స్వర్ణోత్సవ వేడుకలను గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించింది. రామకృష్ణ నాట్యమండలి అధ్యక్షుడు డాక్టర్ జొన్నలగడ్డ జగన్‌మోహనరావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా నిరంతరం పద్య నాటకాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ ఆచార్య కొప్పరపు నారాయణమూర్తి, వివిధ సంస్థలకు చెందిన చింతా వెంకటేశ్వర్లు, వేమూరి సూరిబాబు, ఎ. బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

విశిష్ట పురస్కారాలు ప్రదానం..

నాటక రంగానికి చెందిన విమలకుమారి, పుష్పాల రంగారావులకు విశిష్ట రంగస్థల పురస్కారం, గుమ్మడి జీవన్‌కుమార్, వి.చంద్రశేఖరరావు, బొత్సా సూర్యనారాయణకు రంగస్థల సేవా పురస్కారం, ఎ. వెంకట రమణరాజు, బి. అనంత శ్రీ చరణ్‌కు యువ కళా పురస్కారాలను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్యుడు వాసుదేవరావు బృందం సంప్రదాయ నృత్యాలను, రామకృష్ణ నాట్యమండలి బృందం పాండవోద్యోగ పర్వంలోని ఉపప్లావ్యం ఘట్టం అంశాలను ప్రదర్శించారు. యువ నటులు శ్రావణ్‌కుమార్, పొన్నపల్లి సాయిశంకర్ కార్యక్రమాలను నిర్వహించారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్త, భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్రైజర్‌పేటకు చెందిన షేక్ హజ్రా, ఘపూర్ భార్యాభర్తలు, వీరికి వివాహమై 9 ఏళ్లు అవగా, వారికి ముగ్గురు సంతానం. డ్రైవర్‌గా పని చేసే ఘపూర్ తాగి వచ్చి భార్యను వేధింపులకు గురి చేసేవాడు. కొన్ని నెలల కిందట భార్యాభర్తలకు గొడవ జరగడంతో 5 నెలల పాటు హజ్రా పుట్టింట్లోనే ఉంది. భర్తతో పాటు అత్త హుస్సేన్ బీ మద్యం తాగుతూ హజ్రాను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసేవారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

జ్ఞానదీప్తి వెలిగించేది గురువులు



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు



ప్రొఫెసర్ శివ నాగయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయుడు



అధ్యాపకులకు బహుమతులను అందిస్తున్న కార్యదర్శి అమర్‌సుధీర్



ఎన్వీ రావు, రేణుకాదేవిలను సత్కరిస్తున్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి గురువు గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన హైకోర్ట్ న్యాయవాది ఎం.దేవదానం, అడ్వకేట్ ఆవుల వెంకటరావు, నళినీ కుమారి మాట్లాడుతూ మనలోని అజ్ఞాన పొరలను తొలగించి జ్ఞానదీప్తిని వెలిగించేవారు గురువులని అన్నారు. గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనదని, అందుకే దేవుడు, గురువు పక్కపక్కనే ఉంటే మొదట గురువుకే నమస్కరిస్తానని కబీర్ దాస్ పేర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులను సత్కరించారు. తొలుత సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ ఆర్ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ గోపాలం, ట్రెజరర్ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో గురువుల పాత్ర కీలకమని కేఎల్ యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శివ నాగయ్య తెలిపారు. భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి గురువు తోడ్పాటు ఎంతో ముఖ్యమన్నారు. భారత రాష్ట్రపతిగా అత్యున్నత స్థానానికి చేరుకున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక గురువుగా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమానికి సెయింట్ జాన్స్ స్కూల్ కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ అధ్యక్షత వహించగా ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి పాల్గొన్నారు.

గురువులది గురుతర బాధ్యత..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో గురువుల పాత్ర అమోఘమని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. అనంతరం చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ సామాజిక వికాసానికి విద్య అత్యధిక ముఖ్యమైన సాధనమన్నారు. అటువంటి విద్యను సమాజానికి అందించే గురుతర బాధ్యతను నిర్వహిస్తున్న గురువులకు యావత్ సమాజం రుణపడి ఉంటుందన్నారు. అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు, ప్రిన్సిపల్ ఎస్.రేణుకాదేవిలను శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తి అన్నింటికన్నా ఎంతో పవిత్రమైనదని, సమాజానికి అవసరమైన ఎంతో మంది మేధావులను తీర్చిదిద్దే గొప్ప అవకాశం గురువులకే ఉందన్నారు. బ్యాంక్ డెప్యూటీ మేనేజర్ జోగి అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్షా సోనాకియా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వర్షా సోనాకియా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి భావిభారత పౌరులను అందించే ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని ప్రసంశించారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జాక్ అండ్ జిల్ స్కూల్, ఆశా కిరణ్ స్కూల్, ఈ–వరల్డ్ కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్‌ల ద్వారా విద్య, నైపుణ్యాలతో విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు అంటే కేవలం జ్ఞాన ప్రదాతలు మాత్రమే కాదని దేశానికి మేధాశక్తిని అందించే దేశ నిర్మాతలు అభివర్ణించారు. వారు చూపించే ఓర్పు, నిబద్ధత, నిజాయితి, కరుణ విద్యార్థుల జీవితాల్లో శాశ్వత ప్రభావాన్ని చూపుతాయన్నారు. మధ్యప్రదేశ్ నుంచి సైన్స్‌లో గ్రాడ్యుయేట్, కంప్యూటర్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన అనంతరం సీఏ, ఎన్ఐఐటీ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ బోధనలు చేశానన్నారు. అంతకు ముందు ప్రీ-నర్సరి టీచర్, స్కూల్ ఇన్‌చార్జీ, ప్రత్యేక పిల్లల పాఠశాల సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ వెన్న, పీఆర్ఓ నుస్రత్ మంద్రుప్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన డాక్టర్ విజయశ్రీకి సత్కారం



డాక్టర్ విజయశ్రీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయశ్రీ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమెను అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సహచర వైద్యులు గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు మాట్లాడుతూ పాథాలజీ విభాగంలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఆమె నిబద్ధత, వైస్ ప్రిన్సిపాల్‌గా ఆమె అందించిన సేవలను అభినందించారు. కళాశాల తరపున ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంతి, పాథాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వసుంధర, డాక్టర్ రజని, సీనియర్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.